రోడ్డు దాటాలంటే హడలే..

- జాతీయ రహదారిపై డేంజర్ మలుపు
- వీధిలైట్లు వెలగక అవస్థలు
- ఇండస్ట్రియల్ కాలనీ డివైడర్ వద్ద తరచూ ప్రమాదాలు



ప్రమాదకరంగా మారిన ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ సమీపంలోని డివైడర్ ప్రాంతం

ధవళేశ్వరం: సాధారణంగా జాతీయ రహదారిపై ప్రయాణం చాలా సౌకర్యంగా ఉంటుంది. రోడ్డు చక్కగా ఉండడంతో వాహనాలు సర్రున దూసుకుపోతుంటాయి. ఈ రహదారి నిర్వహణ కూడా చాలా మెరుగ్గా ఉంటుంది. అయితే జాతీయ రహదారిలోని ఇండస్ట్రియల్ కాలనీ డివైడర్ వద్ద పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. ధవళేశ్వరం గ్రామంలోని రావడానికి ఇదే ప్రధాన మార్గం. కానీ ఈ దారిలో రాకపోకలు సాగించాలంటే ప్రజలు భయపడుతున్నారు. పగటి సమయంలో ఇబ్బంది లేకపోయినా రాత్రి పూట మాత్రం బెంబేలెత్తుతున్నారు. అక్కడ వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రమాదాలు జరుగుతాయేమోనని భయపడుతున్నారు.

వెలగని వీధిలైట్లు

జాతీయ రహదారి నుంచి ధవళేశ్వరానికి వచ్చేందుకు ఇండస్ట్రియల్ కాలనీ వద్ద డివైడర్ దాటాలి. అక్కడ వీధిలైట్లు వెలగకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ సమీపంలో జాతీయ రహదారిపై ఎత్తు పల్లాలు ఉండడంతో దగ్గరకు వచ్చే వరకూ వాహనాలు కనిపించడం లేదు. అదే సమయంలో అంధకారం కారణంగా రాత్రి పూట ఆ రోడ్డును దాటలేని పరిస్థితి ఏర్పడింది.

పలు ప్రమాదాలు

ప్రధానంగా ఇండస్ట్రియల్ కాలనీ నుంచి ధవళేశ్వరం వైపుకు వచ్చే డివైడర్ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుతున్నాయి. ఇక్కడ జీబ్రా లైన్లు ఏర్పాటు చేసి వేగాన్ని నియంత్రించే బోర్డులు పెట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వేమగిరి వైపు వెళ్లే వాహనాలు వేగంగా దూసుకుపోతున్నాయి. అదే సమయంలో ధవళేశ్వరం వైపు తిరిగే వాహనాలను ఇవి ఢీకొడుతున్నాయి. ఏడాదిలో ఇక్కడ సుమారు 50కి పైగా ప్రమాదాలు జరిగాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇందులో 90 శాతం పైగా రాత్రి సమయంలో జరిగినవే.

అధికారులు స్పందించాలి

ప్రమాదకరంగా ఉన్న ఈ ప్రాంతం వద్ద తక్షణమే పూర్తిస్థాయిలో లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఎక్కువ లైటింగ్ ఇచ్చే పెద్ద లైట్లను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ధవళేశ్వరంలోని హర్లిక్స్ ఫ్యాక్టరీతో పాటు పలు పరిశ్రమల కార్మికులు జాతీయ రహదారి మీదుగా ధవళేశ్వరం వైపు వచ్చేందుకు ఇదే ప్రధాన మార్గం. కార్మికులకు మూడు షిఫ్టులలో డ్యూటీలు ఉండటంతో రాత్రి, తెల్లవారుజాము ప్రాంతాల్లో ఈ దారిలో ప్రయాణం చేస్తారు.

అంధకారం



జాతీయ రహదారిపై వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో తీవ్ర అంధకారం నెలకొంటుంది. దీంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆ ప్రాంతంలో లైట్లు వెలిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. డివైడర్ వద్ద ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలి.

– గోలి దేవకుమార్, ధవళేశ్వరం

ప్రమాదాల నివారణకు చర్యలు



జాతీయ రహదారిపై ఇండస్ట్రియల్ కాలనీ డివైడర్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. రాత్రి వేళల్లో లైట్లు సరిగ్గా వెలగకపోవడం ప్రమాదాలకు కారణమవుతోంది. డివైడర్ దాటే సమయంలో కూడా ఇబ్బందులు కలుగుతున్నాయి.

– డాక్టర్ చొల్లంగి సత్యగిరి, ధవళేశ్వరం

క్లుప్తంగా

సుబ్బలక్ష్మి టీచర్ సేవలు ఆదర్శనీయం



సుబ్బలక్ష్మి టీచర్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

కడియం: సుబ్బలక్ష్మి టీచర్ సేవలు ఆదర్శనీయమని వీరవరం హైస్కూల్ హెచ్ఎం విశ్వనాథం అన్నారు. ఆ స్కూల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన సుబ్బలక్ష్మి టీచర్‌ను శనివారం సత్కరించారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు ఈవీవీఎస్ఎస్ ప్రసాద్, విశ్రాంత ఎంఈఓ వి.లజపతిరాయ్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు ఆమెను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఆమె చేసిన విద్య, సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో కనుమాంబ, విజయ్ కుమార్, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలుకు పాఠశాలలో వంటశాల ప్రారంభం



వంటశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న పట్టపగలు వెంకట్రావు తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక స్వరాజ్య నగర్‌లోని పలుకు బధిరుల ఆశ్రమ పాఠశాలలో నిర్మించిన వంటశాలను శనివారం ప్రారంభించారు. ఆంధ్రాబ్యాంకు 101వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఈ నిర్మాణం చేపట్టింది. ప్రముఖ సంఘ సేవకులు పట్టపగలు వెంకట్రావు, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ విశ్వేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. పట్టపగలు వెంకటరావు మాట్లాడుతూ దివ్యాంగులకు చేసిన సేవ..దేవుడికి చేసిన సేవతో సమానమన్నారు. వంటశాల నిర్మించిన ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. పాఠశాల నిర్వాహకురాలు గంటా కనకదుర్గ, కేఆర్‌కే రెడ్డి, జి.మల్లేశ్వరరావు, ఐఎస్ఎస్ రాజు, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు సూర్యారావు, పి.వెంకటేశ్వరరావు, మోహన్ దుర్గేష్ , భాస్కరరావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గాత్ర కచేరీ

సీటీఆర్ఐ: వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో ఆదివారం సాయంత్రం నాలుగు నుంచి 6.30 గంటల వరకు విదుషి తులసీ విశ్వనాథ్ (రాజమహేంద్రవరం) గాత్ర కచేరీ జరగనుంది. ఈ మేరకు విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి శనివారం ప్రకటన విడుదల చేశారు. పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం తులసీ విశ్వనాథ్ గాత్ర కచేరీ జరుగుతుందన్నారు. వయోలిన్ పెరవలి నందకుమార్ (గుంటూరు), మృదంగం మండపాక రవి సహకారం అందిస్తారని తెలిపారు. విజయవాడలోని విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో కృష్ణవేణి సంగీత నీరాజనం అనే రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దాని ముందస్తు కార్యక్రమంలో భాగంగా ఈ గాత్ర కచేరీ జరగనుంది.

హెచ్ఐవీపై అవగాహన అవసరం



ఆర్ట్స్ కళాశాల ఆవరణలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ వసుంధర తదితరులు

కంబాలచెరువు: హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధిపై యువత అవగాహన పెంచుకోవాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర అన్నారు. శనివారం రాత్రి స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (అటానమస్) ప్రాంగణంలో ట్రాన్స్‌జెండర్లు, హెచ్ఐవీ బాధిత మహిళలు, వారి కుటుంబ సభ్యులకు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా డీపీసీయూ ఆధ్వర్యంలో ముగ్గులు, పోస్టర్లు పోటీలు నిర్వహించారు.

అనంతరం కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ వసుంధర మాట్లాడుతూ 'హక్కుల మార్గాన్ని అనుసరించండి – నా ఆరోగ్యం నా హక్కు' అనే థీమ్‌తో ఈ ఏడాది ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సిరిపురపు సుభాషిణి, కేంద్ర కారాగారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కోమల, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, సీడీపీవో నరసమ్మ, ఆర్ట్సు కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం, నారీ సాక్ష్యం, వైఆర్‌జీఎస్ స్వచ్ఛంద సంస్థలు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆర్ట్సు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం



వ్యవసాయ వ్యర్థాలతో కంపోస్టు తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ అమ్మాజీ

రాజమహేంద్రవరం రూరల్: భూసార పరీక్షల ఫలితాల ప్రకారమే రైతులు తమ పొలాల్లో ఎరువులను వినియోగించాలని వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. రాజవోలు గ్రామంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా శనివారం రెండో రోజు మట్టి నమూనాల పరీక్షలు, వ్యవసాయ వ్యర్థాలతో కంపోస్టు తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని పర్యవేక్షించడానికి, అదనపు ఎరువుల వాడకం తగ్గించడానికి భూసార పరీక్షలు సహాయపడతాయన్నారు. అధ్యాపకులు డాక్టర్ టి.ఉషారాణి మాట్లడుతూ మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు. అగ్రోనమీ ప్రొఫెసర్ డాక్టర్ పి.అమ్మాజీ మాట్లాడుతూ వ్యవసాయ వ్యర్థాలతో కంపోస్టు తయారీ విధానాన్ని వివరించారు. వ్యవసాయ వ్యర్థాలను భూమిలోనే కుళ్లిపోయేలా చేసి సేంద్రియ ఎరువు రూపంలో తిరిగి నేలకు అందజేయాలన్నారు. వేస్ట్ డికంపోజర్ (ఘజియాబాద్ కల్చర్)ను ఉపయోగించి వ్యర్థాలను కుళ్లబెట్టాలని తెలిపారు. వ్యర్థాలను కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడుతోందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ సీహెచ్ సునీత, డాక్టర్ హెచ్.శ్రీనివాసరావు, గ్రామంలోని రైతులు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక సేవ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న యూనియన్ బ్యాంక్ సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ: సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ ఏ.విశ్వేశ్వరరావు అన్నారు. ఆ బ్యాంకు రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం ఉద్యోగులు శనివారం పలు కార్యక్రమాలు చేపట్టారు. బ్యాంక్ సామాజిక బాధ్యతలో భాగంగా ఎంపవర్ హెర్, హిమ్ పేరుతో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన వెనుకబడిన కులాల బాలికల వసతి గృహం ఆవరణలో వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. గాంధీ కస్తూర్బా సేవాసంఘం స్త్రీల వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ మనోజ్, ప్రసన్న రాజు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులకు అత్యంత గౌరవం



పుష్పకుమారి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, బంధువులు

కడియం: సమాజంలో ఉపాధ్యాయులకు అత్యంత గౌరవం ఉందని ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ అన్నారు. ఏపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బీర పుష్పకుమారి స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆమెకు వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం సత్యనారాయణ మాట్లాడుతూ పుష్పకుమారి 35 ఏళ్ల ఉపాధ్యాయ జీవితంలో ఆరు పాఠశాలల్లో పనిచేశారన్నారు. ఎనిమిదేళ్లుగా కడియం ఉన్నత పాఠశాలలో సేవలు అందించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు రూ.13 వేల విలువైన ఇనుప బీరువా, రూ.12 వేలతో క్రీడాకారులకు యూనిఫాం బహూకరించారు.

స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాలలో ఆదర్శ ఉపాధ్యాయినిగా విద్యార్థులను తీర్చిదిద్దారని పుష్ప కుమారి సేవలను కొనియాడారు. పుష్పకుమారి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం పుష్పకుమారి, జయరాజు దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు, బంధువులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

బాల్య వివాహాలను సమష్టిగా అడ్డుకుందాం



సదస్సులో మాట్లాడుతున్న అనంత ప్రదీప్

రాజమహేంద్రవరం రూరల్: దేశాన్ని బాల్య వివాహ రహితంగా చేయాలనే ఉద్దేశంతో బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఐసీఆర్) అనంత ప్రదీప్ అన్నారు. ఆ విభాగం ఆధ్వర్యంలో బొమ్మూరులోని జీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత ప్రదీప్ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడ జరుగుతున్నా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కనీస వివాహ వయసు రాకుండా పెళ్లిళ్లు చేసుకోకూడదని, తల్లిదండ్రులు బలవంతం చేసినా ధైర్యంగా తిరస్కరించాలన్నారు. మరో అధికారి జి.క్రాంతిలాల్ మాట్లాడుతూ వివాహ వయసుగా అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిర్ధారించారన్నారు. ఆ వయసు నిండకుండా వివాహం చేయరాదన్నారు. బాల్య వివాహాలు చేసిన, సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ 100, అత్యవసర సహాయం 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.నరసింహారెడ్డి, మహిళా సంరక్షణ కార్యదర్శులు ప్రియాంక, చాందిని, ఎస్ఎంసీ చైర్మన్ రాజు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పక ధరించాలి

కంబాలచెరువు: ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, దాన్ని భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ – హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతపై శనివారం జిల్లా కోర్టు ఆవరణలో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ అతి వేగం ప్రమాదకరమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ నిబంధనలను ఉల్లంఘించి ఎవరూ వాహనాలు నడపరాదన్నారు. వివిధ బ్యాంకులు సమకూర్చిన హెల్మెట్లను ఔట్ సోర్సింగ్ సిబ్బందికి పంపిణీ చేశారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

కంబాలచెరువు: విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని, విద్యార్థులు క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు అన్నారు. స్థానిక కేవీ స్టేట్‌హోం, బాలుర పర్యవేక్షణ గృహాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయ మార్గాన్ని అనుసరిస్తే జీవితంలో ప్రశాంతత, గౌరవం లభిస్తాయన్నారు. లేదంటే జీవితం దుర్బలం అవుతుందని వివరించారు. ముందుగా ప్రకాశం నగర్‌లోనిలోని కేవీ స్టేట్ హోంను సందర్శించి అక్కడ వసతులను పరిశీలించారు. అనంతరం బాల సదనంలో చిన్నారులతో మాట్లాడారు. ఏ విధమైన అసౌకర్యం ఉన్నా తమకు తెలియజేయాలన్నారు. అనంతరం ఉద్యోగినుల వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం బాలుర పర్యవేక్షణ గృహంలో బాలురతో మాట్లాడారు.

భద్రతకు బీటలు



ఫ్లై ఓవర్ గోడపై పెరుగుతున్న రావి మొక్కలు →



రాజమహేంద్రవరం రూరల్: బాలాజీపేట నుంచి ఐఎల్‌టీడీ సెంటర్‌కు వెళ్లే ఫ్లైఓవర్‌పై అడుగడుగునా నిర్లక్ష్యం జాడలు కనిపిస్తున్నాయి. ఈ బ్రిడ్జి గోడలపై నగరపాలకసంస్థ అధికారులు అందమైన చిత్రాలను వేయించారు. అయితే అదే గోడలపై పెరిగిపోయిన రావి మొక్కలను ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. అవి భారీగా పెరిగిపోవడంతో గోడలు బీటలు తీసే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఆర్టీసీ అధికారుల ఫోన్ నంబర్లు

జిల్లా ప్రజారవాణా అధికారి	షర్మిల అశోక	91542 91407
రాజమహేంద్రవరం డీఎం	షేక్ షబ్నం	99592 25535
డిపో అసిస్టెంట్ మేనేజర్	అజయ్‌బాబు	73829 12141
డిపో అసిస్టెంట్ ఇంజనీర్ (గ్యారేజ్)	ఎస్.నాగలక్ష్మి	79890 45549
సీనియర్ మెడికల్ ఆఫీసర్	ప్రసూనాంబ	97014 50208
డిప్యూటీ మెకానికల్ ఇంజనీర్ జోన్–2	రవిశంకర్	99592 25789
డీపీటీవో అకౌంట్స్ ఆఫీసర్	ఆర్‌వీ కోటేశ్వరరావు	99592 25529
అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కార్గో)	కె.మాధవ్	73311 47262
డీపీటీఓ పీఆర్ఓ	బి.శివకుమార్	73829 09283
చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్	బి.మోహన్ కుమార్	73829 10603
రిజర్వేషన్ కార్యాలయం ఇన్‌చార్జ్	మహ్మద్ రియాజ్	99592 25561
డీపీటీఓ రీజినల్ కోర్ గ్రూప్ మెంబర్	జి.కృష్ణ	73829 09296
మెకానికల్ అసిస్టెంట్ ఇంజనీర్	జీఎల్ఎన్ మూర్తి	73829 11418
డీపీటీఓ ఆఫీస్ సూపరింటెండెంట్	టి.మల్లేశ్వరరావు	73829 09279
రాజమహేంద్రవరం బస్టాండ్ మేనేజర్	డి.త్రిమూర్తులు	73829 10187
హెవీ డ్రైవింగ్ స్కూల్ ట్రైనర్	వీఎస్ఎల్ రావు	99483 13344

ఉమా మార్కండేయేశ్వరస్వామికి పూజలు



సీటీఆర్ఐ: ఉమా మార్కండేయేశ్వర స్వామి క్షేత్రం చాలా పవిత్రమైందని హంపి గోవిందానంద సరస్వతి అన్నారు. గోదావరి గట్టున గల స్వామి వారి ఆలయాన్ని శనివారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని పార్వతీమాతకు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు నీలమణికంఠ శర్మ పాల్గొన్నారు.

← హంపి గోవిందానంద సరస్వతికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

చదరంగం కోచ్‌ల సంక్షేమానికి చర్యలు



చదరంగంలో మెళకువలు చెబుతున్న ప్రముఖులు


రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో చదరంగాన్ని పూర్తిస్థాయిలో ప్రోత్సహించడం, అభివృద్ధి చేయడంలో భాగంగా కోచ్‌ల సంక్షేమానికి చర్యలు చేపడుతున్నట్లు ఆంధ్రా చెస్ సంఘం అధ్యక్షుడు అరసుమిల్లి సురేష్ తెలిపారు. నగరంలోని లా ఆస్పిన్ హోటల్లో శనివారం చెస్ న్యాయ నిర్ణేతల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ లంకా రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఏపీలో చెస్ కోచ్‌లు, ఆర్బిటర్ల కోసం బీమా సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని, అలాగే పీఎఫ్ వచ్చేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారందరూ ఉత్తమ ఆర్బిటర్‌గా రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా చెస్ కోచ్‌లకు చదరంగంలో మెళకువలను వివరించారు. ఏపీ చెస్ సంఘం చైర్మన్ ఏవీవీ శర్మ, సహాయ కార్యదర్శి ఎం.రాజేష్, సెక్రటరీ జగదీష్, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అనంత రామన్, పాల్ పాల్గొన్నారు.

96.05 శాతం పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 96.05 శాతం జరిగిందని ఎంపీడీవో డి.శ్రీనివాసరావు తెలిపారు. 19,687మంది లబ్ధిదారులకు రూ.8.52 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, 18,910 మందికి రూ.8.17 కోట్లు పంపిణీ చేశామన్నారు.

కడియం: మండలంలో శనివారం 95.86 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీవో రమేష్ తెలిపారు. 11,363 మంది లబ్ధిదారులకు రూ.48.67 కోట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు.

సినిమాలు



శ్యామల : మెకానిక్ రాకీ
సూర్యమినీ : క
సూర్యప్యాలెస్ : మెకానిక్ రాకీ
శివజ్యోతి : జీబ్రా
అనుశ్రీ : రణగల్
స్వామి : అమరన్
అశోక: లక్కీ భాస్కర్
రాజా : క
రంభ : ఉద్వేగం
ఊర్వశి : కంగువా
మేనక : ఆదిపర్వం
కుమారి : ఇష్క్
అప్సర : రోటీ కపడా రొమాన్స్

నామవరం
వీఎస్ మహల్ : అమరన్

ధవళేశ్వరం
మురళీకృష్ణ : మెకానిక్ రాకీ

కడియం
వెంకటసూర్య : అమరన్